సుదీర్ఘమైన ఆ ఉత్తరంలో ఆమె తన భర్తని ఏం కోరింది?

భారతి ఏకాంతం కథ

# నీ జ్ఞాపకాల నీడలలో

సాయంకాలం నాలుగవుతోంది. అంటే ఆఫీసులో ఇంకో గంటన్నర గడపాలన్న మాట. మొదటిసారిగా నేనిలా ఆలోచించడం తెల్సుకుంటే నాకే ఆశ్చర్యమేసింది ఇంటర్‌కంలో కనుక్కుంటే డిజియంగారు ఇంకా ఆఫీసులోనే వున్నట్టు తెల్సింది. అంటే ఇక తప్పదు. ఆయన నా కోసమే ఎదుర్చూస్తుంటారు. ఆయన పిలిపించకముందే నేనే మర్యాదగా వెళ్ళి ఆయన్ని కలిస్తే బావుంటుంది. కానీ ఎందుకో ఎప్పుడూలేని స్లయిట్ హెజిటేషన్ నా మనస్సులో. తయారుంచుకుని ఆయన కాబిన్‌లోకి అడుగుపెట్టాను. ''కమాన్ రాజ్! ఎందుకు డిలే చేస్తున్నావ్? ఈ రోజు మెడ్—వెల్ హాస్పిటల్స్ విషయం ఫాలోఅప్ చేసి ఫైనలైజ్ చేద్దామని ముందే అనుకున్నాం కదా! మనం ఆలోచిస్తూ కూర్చుంటే ఆ టెండర్ చేయి జారిపోతూంది. గెట్ రెడీ. బి క్విక్ అని కంగారు పెట్టాడు. ''కానీ సర్! నేను కాస్త మీతో ఓ విషయం మాట్లాడదామనుకుంటున్నాను. మీరు వినే మూడ్లో వున్నారా?'' నీళ్ళు నముల్తూ అడిగాన్నేను. ఆయన నా మొహం కేసి కాస్తంత సీరియస్‌గా చూసి, నా భావాలు గమనించగానే, తన్ను తాను సంభాళించుకున్నట్టుగా మెల్లిగా ప్రశ్నించాడు. ''రాజ్! ఎనీ ప్రాబ్లం'' ఆయన నా సీనియరే కాదు, నాకెంతో ఆప్తుడు, మిత్రుడు కూడాను. వయస్సులో నాతో దాదాపు సమానమే అయినా, తన ప్రతిభా పాటవాలతో డిజియం స్థాయికి ఎదిగిపోయాడు. నా టెంపర్, సీరియస్‌నెస్ లాటివి నన్ను ఎంత కష్టపడితే తప్ప ఎజియం స్థాయికి చేర్చలేకపో



యాయి. అలా సర్వీసులో సమానత వున్నా, స్థాయిలో ఓ మెట్టు దిగువన వుండిపోయా న్నేను. అయినా ఆయనెప్పుడు ఆ తేడా కనబర్చడు. నేను ఆఫీసులో వున్నంత వరకూ తనను 'సర్' అని సంబోధించినా, బయట 'శేఖర్' అనే పిలుస్తాను. మీ ఇద్దరికీ ఒకరి పర్సనల్ విషయాల్తో మరొకరికి పెద్దగా టచ్ లేకపోయినా ఆఫీసులో మంచి

రిలేషన్‌షిప్ మెయింటెయిన్ చేస్తాం.

"సర్! ఇది చదవండి ఒకసారి" అనేసి ఓ ఎన్వెలప్ అందించాను. ఆయన మొహం లో చిరాకు కన్పించింది నాకు. అయినా పట్టించుకోనట్టుగా అది ఆయన ముందుకు జరిపాను. ఇక తప్పదన్నట్టుగా, అందుకుని ఓపెన్ చేసాడతను. అందమైన గులాబీ రంగు కాగితాన్ని తీసి చదువుతూన్నప్పుడు మారే అతని ముఖ కవళికల్ని గమనిస్తూన్నాను నేను.

ఏమండీ!

ఎలా వున్నారు? నాల్గు రోజుల క్రితం కాంప్ పనిమీద వెళ్ళారు. నిన్న రాత్రి వచ్చారు. ఈ రోజు ప్రొద్దున ఆఫీసుకెళ్ళిపోయారు. నాల్గు రోజులేం ఖర్మ, వారాల తరబడి మనం చూస్కోకుండా వున్న సందర్భాలున్నాయి. కానీ, ఎందుకో ఈసారి మాత్రం గుండె 'వాయిడ్' అయిపోయిందం డీ!... అన్నట్టూ నేను మీ టైం వేస్ట్ చేసి బోర్ కొట్టిస్తున్నానా? ప్లీజ్! ఈ ఒక్కసారికి బేర్ విత్ మి. ఎందుకంటే ఇదే నా మొదటిదీ చివరిదీ అయిన ఉత్తరం. సరేనా!

ఇక విషయంలోకొస్తే మొన్న మన కాశ్యప్ కన్పించాడు. సూపర్ మార్కెట్ దగ్గర. కాశ్యప్ ఎవరో గుర్తుకు రావట్లేదా? అదేనండీ, యూనివర్సిటీలో మన క్లాస్‌మేట్ మన ప్రేమ కథకు సూత్రధారి. ప్రస్తుతం డిఎస్‌పిగా పంజాబ్‌లో పని చేస్తున్నాట్ట. అతని అత్తగారిల్లు హైదరాబాద్ అవడంవల్ల మామగారికి వంట్లో బాలేకపోతే ఎలాగూ పాపకి హాలిడేస్ కదా అని ఫ్యామిలీతో సహా వచ్చాడట. అతని భార్య 'పూజ' చాలా ఫ్రెండ్లీ టైప్. మనిద్దరి గురించి అప్పుడప్పుడూ తనతో చెప్తూంటాడని చెప్పింది. వాళ్ళ ముగ్గుర్నీ మనింటికి ఆహ్వానించాను. మొన్న రాత్రి డిన్నర్‌కి వచ్చారు. వాళ్ళ పాప పన్నెండేళ్ళ 'తేజ' మన 'ప్రార్థన'కి మంచి స్నేహితురాలైపోయింది. మేమందరం చాలా సర్దాగా గడిపాం వాళ్ళున్నంత సేపూ. మిమ్మల్ని కలవలేకపోయినందుకు చాలా ఫీల య్యాడతను. మన కాలేజీ రోజుల గురించి తిరగేసి, మరగేసి మాట్లాడుతున్నాం. వెళ్ళే ముందు తన అడ్రస్ ఇచ్చాడు. ఇక నుంచి మన రెండు ఫ్యామిలీస్ టచ్‌లో వుండాలని ప్రామిస్ తీస్కున్నాడు. అసల్నేని ఉత్తరం వ్రాయడానికి పరోక్షంగా అతనే 'ఇన్స్పిరేషన్' ఎందుకో చెప్తానాగండి.

నిన్న వాళ్ళు వెళ్ళిపోయిం తర్వాత మన ప్రార్థన అన్యమనస్కంగా కన్పిస్తే, కారణమే ంటని అడిగా. చాలా సేపు బుజ్జగించిన తర్వాత అంది. "మమ్మీ! డోంట్ యూ థింక్, యూ హావ్ డెవలప్డ్ సమ్ గ్యాప్ విత్ పాపా. నాన్నా బిజీగా వుంటారని ఎప్పట్లా సర్ది చెప్పకు. అంకుల్‌కి లీజర్ ఏమైనా తేరగా దొరుకుతోందా? అయినా వాళ్ళు ఫ్యామిలీ మొత్తం 'హాలిడేస్'ని ఎలా ఎంజాయ్ చేస్తున్నారో చూడు. అంకుల్ మీద ఆంటీకి ఎంత హోల్డ్ వుందో, ఆంటీ ఫీలింగ్స్ పట్ల అంకుల్‌కి ఎంత కన్సర్నో నీవే అబ్జర్వ్ చేయలేదూ? పోనీ నీవే ఆనెస్ట్‌గా చెప్పు, మీ ఇద్దరి మధ్యా అసలంత 'ఇంటిమసీ' వుందా? నువ్వెందుకమ్మా, నాన్ననలా నిశ్శబ్దంగా టాలరేట్ చేస్తావు? గొప్ప భారత

స్త్రీ లక్షణమనుకుంటున్నావా? లేకపోతే ఎప్పుడూ ఆఫీసు, టూర్స్ అని తిరిగే నాన్నని కాస్త ఫ్యామిలీ లైఫ్ లీడ్ చేయమని చెప్పవెందుకూ?'' అని. నేను చచ్చేంత ఆశ్చర్యపోయా— ఇది మన ప్రార్థనేనా అని రాత్రిపూట టాయిలెట్‌కి వెళ్ళాల్సొస్తే నా చేయి గట్టిగా పట్టుకుని, తలుపు వరకూ తోడు తీసికెళ్ళే మన ప్రార్థనేనా, మనిద్దరి మధ్యా, సంవత్సరాలుగా పేరుకుపోయిన నిశ్శబ్దాన్ని ఇంత నిశ్శబ్దంగా, క్లోజ్‌గా స్టడీ చేసిందీ అని. నాకు సంతోషంగానే అనిపించింది. కానీ, అది మన సంబంధాన్ని కామెంట్ చేస్తే మాత్రం, నా ఈగో దెబ్బతింది. ''ఏమిటే! వేలెడంత లేవు, నాకే పాఠాలు వల్లిస్తున్నావ్!'' అని పెద్దరికంగా తిడుదామనుకున్నాను. కానీ చూద్దును కదా! మనిద్దరం గమనించలేదు కానండీ! అది నా భుజాలవరకు ఎదిగింది. నిజం. దాని నడతలో ఎంత నిండుతనం, కళ్ళలో ఎంత ఆత్మవిశ్వాసమనీ. పదిహేనేళ్ళకే జీవితం పట్ల ఓ అవగాహన ఏర్పర్చుకుంటోంది. మీకు గర్వంగా లేదూ! నేను దానికే సమాధానమూ చెప్పలేకపోయాను. కానీ, మన మధ్య నున్న ఆ తెరను ఛేదించి దాని కోర్కె తీర్చే ప్రయత్నంలో నా వంతు కృషి సిన్సియర్‌గా చేయాలన్పించిందండీ! అందుకే ఈ ఉత్తరం.

రాజ్ మీకు మన యూనివర్సిటీ రోజులు గుర్తుకు రావట్లేదూ? క్లాసులు ఎగ్గొట్టి మీరూ, నేనూ ఆడిటోరియంలో కూర్చుని ఎన్ని పోచికోలు కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ట్యాంక్ బండ్‌మీద మనిద్దరం బైక్‌మీదెళ్తాంటే, ప్రొఫెసర్ గారు చూసారని నేను కంగారు పడుతూన్నపుడు మీరతనికి చెయ్యూపి ''హాయ్! సర్'' అని గట్టిగా అరచి విష్ చేసి నన్నేడ్పించారో సారి గుర్తు లేదూ! మనం ఫ్రెషర్స్‌కి పార్టీ ఇచ్చే రోజు, అంత మందిలోనూ కాశ్యప్ బ్రేక్ డ్యాన్స్ చేస్తే, అబ్జెక్ట్ చేసి క్లాసికల్ చేయమన్న మన ఎకనామిక్స్ ప్రొఫెసర్‌ని, మరుసటి రోజు



## చిత్రం

అతిథులు ఆతిథ్యాన్ని స్వీకరించి తిరిగి వెళ్తున్నప్పుడు చేయి ఊపి వీడ్కోలు చెబుతాం. అయితే టిబెట్‌లో అతిథులు ఆతిథ్యాన్ని స్వీకరించి తిరిగి వెళ్తున్నప్పుడు నాలుకచాపి వీడ్కోలు చెబుతారు. మీ మాటలు మాకెంతో రుచికరంగా వున్నాయని చెప్పడం ఈ చర్య ఉద్దేశ్యం.

—పురం రవీంద్రరావ్ (ముల్తానాబాద్)

నుంచి మనమందరం ''బృహన్నల' అనేడ్పిం చడం గుర్తొస్తే చచ్చేంత నవ్వొస్తుందిప్పటికీ. మొన్న కాశ్యప్ ఈ విషయం అందరికీ చెప్పగానే ప్రార్థన వాళ్ళెంత నవ్వేసారో. నిప్పులు చెరిగే ఎండలో, క్యాంపస్ చెట్ల నీడల్లో, హాయిగా గట్ల మీద అందరం వర్సగా కూర్చుని చెరుకు రసం త్రాగుతూ, వచ్చేపోయే వాళ్ళకి పేర్లు పెట్టి ఏడ్పించడం చెప్తే ప్రార్థన అసలు నమ్మట్లేదు, మీరంత అల్లరి చేసేవారంటే.

ఏదైనా డిస్కస్ చేయాల్సిన విషయము ంటే, పెద్ద రాజకీయ నాయకుల్లా మనమం తా క్యాంటిన్‌లో చేరి గుంపుగా కుర్చీల్లో ఒకరిమీదొకరు వాలిపోతూ కూర్చుని, కాఫీ లు త్రాగుతూ మేము, సిగరెట్లు ఊదేస్తూ మీరు సీరియస్‌గా మాట్లాడేసుకోవడం, చిటపట చినుకులు పడ్తూంటే, క్లాసు బయటికొచ్చేసి అందరం కల్సి మన ఆవరణ లోనే వున్న 'సిరాజ్'గాని టీ బంక్ దగ్గర 'వన్ బై టూ'లు త్రాగడం జ్ఞాపకం చేస్కుంటే ఎంత థ్రిల్లింగ్‌గా వుందో. ఆఖర్న, మన ఫేర్‌వెల్ పార్టీ రోజు మన క్లాసు బయటే వున్న పొగడ చెట్టు క్రింద, చిన్న చిన్న చినుకులు పూల జల్లుల్లా మీద పడుతూంటే, అప్పుడప్పుడూ నా వంక చూస్తూ... 'ఛల్తే... ఛల్తే...'' అని మీరు పాడిన పాట తల్చుకుంటే నా ఒళ్ళు ఝల్లుమంటూంది. మీలో ఆ వివేషియసస్ నెస్ ఏమయిందండీ? ఎంత అల్లరల్లరిగా, ఆనందంగా వుండేవాళ్ళం. కానీ, చదువులో కూడా పోటీలు పడేవాళ్ళం. ఎంతెంత చిన్న, చిన్న సిల్లీ విషయాలు కూడా చెప్పుకునేవా ళ్ళం. మనిద్దరం అలాగే కల్సి మెల్సి హాపీగా వుండాలని మనస్ఫూర్తిగా కోరుకునే మన స్నేహితులు, మన పెళ్ళి కావడానికి ఎంత సాయపడ్డారో మీరు మర్చిపోయారా? మీకు మళ్ళీ అందర్నీ చూడాలనీ, అప్పట్లోలా లైవ్లీగా వుండాలనీ అన్పించట్లేదూ? మన పెళ్ళికి మీ వాళ్ళు ఒప్పుకోకపోయేసరికి, అలిగి బయటికొచ్చేసి, కాశ్యప్ రూంలో నెల్రోజులు ఉద్యోగం వచ్చేవరకూ వున్నారు మీరు. అప్పుడతను మీకెంత మోరల్ సపోర్ట్ ఇచ్చాడో మీకసలు గుర్తుందా?

మీరన్నీ ఎంత తేలిగ్గా తీస్కుంటారండీ! ఎదుటివాళ్ళ స్నేహాన్ని, వాళ్ళు కనుమరుగవ గానే ఎంత సునాయాసంగా మర్చిపోగల్రు. ఎన్నిసార్లు చెప్పాను నేను మీకు, కాశ్యప్ ఎక్కడున్నాడో, ఎలాగున్నాడో కనుక్కోమని ఎప్పుడైనా నా మాట పట్టించుకున్నారా? కొత్త పరిచయాలు జరగ్గానే పాతవి మర్చిపో డం 'వృద్ధిలోకి వచ్చేవాడి లక్షణం అనుకుం టారు మీరు. నాకు తెల్సు, నేనిలా మాట్లాడితే మీ పురుషహంకారం దెబ్బతిం టూందని. మన మధ్య అలాటివి తలెత్తకూ డదనే నేనిలా మాట్లాడలేదిది వరకు. ఇద్దరం సమానంగానే చదువుకున్నా, నన్ను ఉద్యోగం చేయనీయకుండా, గృహిణిగా స్థిరప డిపోమంటే కూడా నేను నోరెత్తలేదు.


అయినా ఆ విషయంలో నాకేం అసంతృ ప్తి లేదులెండి. ఓ ఉద్యోగస్థురాలికంటే కూడా బాధ్యతాయుతమైన, పవిత్రమైన వృత్తి నాది. కానీ ఈ 'డెసిషన్‌మేకింగ్' అన్నది ఎప్పుడూ మీవైపునుంచే జరుగుతుం టే మాత్రం జీవితం నిస్సారంగా తోస్తుంద

ండి! 'ఎవరికిమాత్రం నా అస్థిత్వం ఉపయోగకరం?' అన్న నిస్పృహ.

మనం కల్సి ఎక్కడికైనా సర్దాగా వెళ్ళి ఎన్నేళ్ళయింది? మన ఒక్కగానొక్క కూతురు ప్రార్థన 'మానసికావసరాలు' మనమెంత వరకూ తీర్చాం? 'మానసికావసరాలు' అని నేనంటే మీకేం అర్థమైందో నాకు తెలీదు. కాని మనం జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించడంలేదన్న అసంతృప్తి మాత్రం దాని చిన్న బుర్రలో స్థిరపడిపోయింది. దానికి మనమే బాధ్యులమని మీకన్పించడంలేదూ?

ఒక్క విషయం చెప్పండి. సొసైటీలో గౌరవంగా బ్రతకడానికి ఇప్పుడు మీకున్న స్టేటస్, సంపాదన చాలదూ? దీన్తో తృప్తిపడక ఇంకా ఏవేవో అద్భుతాలు చేసేసి ప్రమోషన్లు తెచ్చేస్కుని, పైపైకి పోదామన్న యావ దేనికీ? మీరు సంపాదించేది మా సుఖం కోసమేనయితే, మాకు సుఖమివ్వని మీ సంపాదన దేనికి? మీరూహించినట్టు మీ కూతురు 'కాంటెస్సా క్లాసిక్'లో కూర్చుని స్కూలుకి వెళ్ళాలనుకోవడంలేదు. తండ్రి వెనకాల స్కూటర్‌మీద కూర్చుని వెళ్ళే థ్రిల్ కావాలనుకుంటోంది. నా పుట్టినరోజుని గుర్తుంచుకుని, మీరు బొంబేనుంచి 'కుకింగ్‌రేంజ్'ని గిఫ్ట్‌గా పంపేబదులు, మీరారోజు కనీసం ఆ సాయంకాలం నాతో గడిపుంటే నాకెంతో తృప్తిగా వుండేది. నేను మరీ సెంటిమెంటల్‌గా, తెలుగు సినిమాల్లోలా మాట్లాడుతున్నానా? నాకు తెలీదు, కాని కొన్ని సంవత్సరాలుగా నా మనస్సులో మెదుల్తూన్న ఈ ఆలోచనలకి జవాబు చెప్పాల్సింది మాత్రం మీరే.

క్యాంప్స్‌కి వెళ్ళేముందు నాతో ముందే చెప్పే మొహం లేకో లేదా టైం లేకో ఆఫీసుకే సూట్‌కేస్ తెప్పించుకుని ఫోన్ చేసేసి వెళ్ళిపోవడం అలవాటయింది మీకు. మీరలా చెప్పా పెట్టకుండా వారాల తరబడి డిక్కు పట్టుకుపోవడం నన్నెంత బాధిస్తుందో ఎప్పుడైనా ఆలోచించారా? కనీసం మీరు



ఫోన్ చేయరు (ఎప్పుడో తప్ప), ఉత్తరం వ్రాయరు. ఎలా వున్నారోనని నా దిగులు.

మీరు తిరిగి వచ్చేటప్పుడు కనీసం ఒక్కసారైనా నాకు గాజులో, ప్రార్థనకు పెయింట్‌బాక్సో తెచ్చారాండీ మీరు? అవి నేను కొనుక్కోలేకాకాదు, మీరు నాకు డబ్బులివ్వకా కాదు.

మేము గుర్తుంటామన్న విషయం తెలియజెప్పడానికిదో పద్ధతి. నేనిప్పుడేం కంప్లెయింట్ చేయట్లేదు. కానీ ఇప్పుడున్న మీ పరిధినుంచి కొద్దిగా, అతి కొద్దిగా బయటికొచ్చి మా ఫీలింగ్స్‌కి రెస్పాండ్ అయితే, మేమెంత సంతోషిస్తామో చెప్తున్నాను.

ఏమండీ! పౌర్ణములు వచ్చెళ్ళిపోతున్నాయి. వెన్నెల్లూ కరిగిపోతున్నాయి. అవన్నీ వృధా అయిపోతున్నా స్పృహ అయినా మీకుందా? కిటికీ అవతల వాడిపోయే మల్లెలూ, గదిలో నుసిగా రాలిపోయే అగరువత్తులూ చూస్తూ గుండెనిండా దిగుల్తో వంటరిగా నేనూ...

జీవితంలోంచి చేజారిపోయిన భావుకత లాంటిదేదో తిరిగి చేజిక్కించుకోవాలనిపించడంలేదూ మీకు? ఇరవైనాలుగ్గంటలూ నా ఎదురుగా కూర్చోమని నేన్చెప్పట్లేదు. కానీ మీ రొటీన్లోనే అప్పుడప్పుడూ, మీరు నన్ను గుర్తుచేసుకుంటారన్న భావన నాకు బోల్డంత తృప్తినిస్తుందని మీరు తెలుసుకోవాలి.

ప్రొద్దున లేవగానే మీ పేస్టు, బ్రష్ సిద్ధంగా వుండడం వెనుకా, కాఫీ, టిఫిన్లు మీ ఇష్టప్రకారంగా టైంకి అమరడంవెనుకా, మీరు వేసుకోవాల్సిన సూటు రెడీగా డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర వుండడం వెనుకా, మీ కర్చీపు కోటుజేబులో శుభ్రంగా వుతికిపెట్టి వుండడం వెనుకా, మీ పెన్‌లో ఇంక్ నిండుగా వుండడం వెనుకా, నా శ్రద్ధ, మీ పట్ల అహర్నిశలూ అప్రమత్తంగా వుండే నా అనురాగం అని గుర్తుంచుకుంటే, గుర్తుంచుకున్నారన్న విషయం అప్పుడప్పుడూ కాస్త మీ టైం వేస్టుచేసుకుని, చిన్నచిన్న చర్యలద్వారా నాకు తెలియజేస్తే నాకంతకంటే ఆనంద మేముందండీ?

నేనిలా వ్రాస్తుంటే మీరేం వర్రీ అవకండి. నేను మిమ్మల్ని సాధించే ప్రోగ్రాంలేం పెట్టుకోలేదు కొత్తగా. నేను మిమ్మల్ని ఏదైనా వేడుకున్న సందర్భం అంటూ వుంటేగింటే అది ఇదేననుకుంటూ. బహుశా ఇదే చివర్దికూడా కావచ్చు. దీన్తర్వాత మన జీవితాల్లో ఏదైనా అందమైన మార్పు తేవాలని మీరనుకుంటే అది నా అదృష్టమనుకుంటాను. లేదంటే, మీరు మీ రొటీన్లోంచి బయటపడ్డానికి సిద్ధంగా లేకపోతే మాత్రం నేనేం కృంగిపోను, సాధించను, బాధించను. నిశ్శబ్దంగా రాజీ పడతాను. సంసారం సాఫీగా సాగిపోవడానికి అవసరమైతే సర్దుకుపోవడానికి నేనెప్పుడూ సిద్ధమేనని మీకు తెల్సుండాలి ఇప్పటికే. మీ దైనందిన కార్యక్రమాలకి ఏమాత్రం ఒడిదుడుకులు రాకుండా, నా జీవితాంతం చూడ్డం నా బాధ్యత అని నేననుకుంటున్నాను. నేనిలా మాట్లాడితే 'విమెన్స్ లిబ్' వగైరాలగురించి మాట్లాడే 'కల్చర్డ్ విమెన్(?)' నన్నుచూసి హేళనగా నవ్వుతారేమో, తెలుగు సినిమా హీరోయిన్లా మహా పతివ్రత కబుర్లు చెబుతున్నావని, 'నవ్విపోదురుగాక — నాకేటిబాధ' అదేదో

కవిగారన్నట్టు.

"అనూప్ జలోటా మ్యూజికల్ నైట్‌కి వెళ్దాం, త్వరగా రండి సాయంకాలం" అన్నానంటే, "నాకు పనుంది ఆఫీసులో, నువ్వూ, ప్రార్థనా వెళ్ళిరండి" అంటారు మీరు. అసలెంత 'వర్క్‌హాలిక్' అయిపోయారండీ మీరు? ఈ 'స్టేటస్ కో'లో పడి ఎంత యాంత్రికంగా తయారయ్యారో, ఎన్నెన్ని అందాలూ, ఆనందాలూ వదులుకుంటున్నారో తెల్సామీకు? మీరవేవీ అనుభవించనప్పుడు నాకుమాత్రం అవెందుకని నేనూ జడంలా తయారవుతున్నానని మీరెప్పుడయినా గమనించారా? బహుశా మీలాంటివాళ్ళనుద్దేశించే అనుకుంటా కీట్స్ 'ఆన్ ఫేమ్' అన్న పద్యం వ్రాసింది.

"పోన్లే, ఊళ్ళోనే వున్నారుకదాని' సంతృప్తితో రాజీ పడబోతుంటే హఠాత్తుగా ఊరెళ్ళిపోతారు. వెళ్ళారు. వెళ్ళారు అని బాధపడ్తుంటే ఎప్పటికో వస్తారు. వచ్చిన మనిషి "ఎలా వున్నావూ? నేను లేనన్నిరోజులేం చేశావు? ఏం ఇబ్బందులు పడుతున్నావోనని నా మనసంతా ఇక్కడే వుంది తెల్సా. ఇక నేనొచ్చేసాగా, అన్నీ నేన్చూసుకుంటాను" అని నా దిగుల్నంతా ఒక్కసారిగా తీసేసి, దగ్గరకు తీసుకుని ఓదారుస్తారని ఎదుర్చూసే నాకు ప్రతిసారీ నిరాశే.

మీరే చెప్పండి. నిన్న రాత్రి నుంచి, ఈ రోజు ప్రొద్దున ఆఫీసుకెళ్ళేలోపు మనమేమేం మాట్లాడుకున్నాం? పని భారంతో మీరల్సిపోతూంటే, కళ్ళ క్రింద వలయాలు తెచ్చుకుంటూంటే చూళ్ళేక పోతున్నాను. ప్రతిరోజూ, రాత్రి పన్నెండు దాటాక వచ్చే మీరు— 'భోంచేస్తారా?' అన్నేనడిగితే 'తినొచ్చాను, నీవెళ్ళి తిను' అనేసి మంచంమీద అలసటగా మీర వాలిపోతే, 'నేను ప్రార్థనతో కల్సి తినేసాన్లెండి' అని నీరసంగా అబద్ధమాడే నేను— మరో ఐదు నిమిషాల్లో ఆరిపోయే బెడ్ లైట్. యాంత్రికత నిండిన శారీరకమైన కోర్కెలకూ, అలవాటైన అలసిన శరీరాలకూ మధ్య యుద్ధం. దానికి మొరాయించే



# అంతే

తీవ్ర గాయాలతో బెడ్‌మీద ఉన్న ఓ క్షుర ఫామిలీ ప్లానింగ్ ఆఫీసర్‌ను అతని పై అధికారి పరామర్శించాడు—

"ఎలా జరిగిందీ సంఘటన"

"నిన్న ఒక ఇల్లాలితో వెనుకాముందు ఆలోచించకుండా పిల్లలు పుట్టకుండా ఉండాలంటే 'మనం' ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలలో ఇప్పుడు చెబుతున్నాను. అంతే" మూలుగుతూ చెప్పాడు క్షుర ఆఫీసర్.

—గొంటు శ్రీనివాస్ (కవిటి)

మనస్సు నేపథ్యం. మనం ఆకలిని తీర్చుకోవ డమే తప్ప, దైన్నేనా ఆస్వాదిస్తూ అనుభవిం చి ఎన్నేళ్ళయిందండీ?... మీకివన్నీ లోట్లని అసలెప్పుడయినా తోచాయా? అని నా డౌటు. ఆలోచించకూడదూ?

చాలా రోజుల తర్వాత చిలిపిగా మాట్లా డనా. నిన్నేం జరిగిందో తెల్సా. కాశ్యప్ మన ప్రేమ కథ గురించి మొన్న అంతగా చెప్పాక, ప్రొద్దున్న టిఫిన్ చేస్తున్నప్పుడు ప్రార్థన అడుగుతోంది. 'అమ్మా! నువ్వు నాన్నతో ఏం చూసి ఫ్లాటయిపోయావసలు. బొత్తిగా ఈస్థటిక్ సెన్సలేని మనిషి కదా, అసలు మీది లవ్ మ్యారెజ్ అంటే నమ్మబుద్ధి కావట్లేదు' అని. నేనొక్కసారిగా 'బ్లష్' అవగానే. అదెంత ఏడ్పించిందని?

''ఎగ్జాక్ట్‌గా ఏమీ చెప్పలేను ఇలా అడిగితే. ఆలోచించి చెప్తా క్లియర్‌గా'' అని అప్పటికి వదిలించుకున్నాను దాన్ని. ఆ తర్వాత మన గతం తాలూకు అందమైన అనుభవాల అలలు ఒక్కసారిగా కదిలించినట్లుగా, నన్నెం త అలజడికి గురి చేసాయో తెల్సా. రాత్రి ఊర్నుంచి వచ్చి అలసి పడుకున్న మిమ్మల్ని అర్థరాత్రి దాటక లేచి దొంగతనంగా చూ స్తూ ఎంతసేపూ కూర్చున్నానో తెల్సా. మీ చెంపల దగ్గర తెల్లబడుతూ మీకో వింత అందానిస్తూన్న మీ జుట్టు, మీ నుదిటి మీద లీలగా ఏర్పడ్డ గీతలు అనుభవాన్ని తెలియజే ప్తూంటే కరిగి చేజారిపోతున్న కాలం గుర్తొ చ్చి గుండె గుభిల్లుమంది. అప్పటికప్పుడు మిమ్మల్ని నిద్రలేపి 'ఎంతకాలమీనిశ్శబ్ద సంగీ తం' అని ఆవేశంగా అడగాలన్పించింది. ప్రార్థన అడిగిన ప్రశ్నకి కృష్ణశాస్త్రి గేయమొ కటి గుర్తొచింది స్పాంటేనియస్‌గా. అదేం టో చెప్పనా—

''సౌరభమ్ము లేల జిమ్ము పుష్పవ్రజమ్ము,
చంద్రికల నేల వెదజల్లు చందమామ,
ఏల సలిలంబు పారు,
గాడ్పేల విసరు''

అన్నట్లుగా—

''ఏల నా హృదయంబు నిన్ను ప్రేమించు
ప్రేమామృత వర్షమేల కురిపించు''

ఎలా వుంది నా జవాబు? బావుంది కదూ! ఈ రోజు ప్రొద్దున్నే, ప్రార్థనకిదే చెప్పా. ''వావ్! లవ్లీ లవ్'' అని థ్రిల్లయిపో యింది. మీరూ అవుతున్నారా, లేదా?

ఇక ఇలా వ్రాస్తూ పోతే మై పెన్ మూవ్స్ అనింటరప్టెడ్లీ. అందుకే ఉపసంహ రిద్దామనుకుంటున్నా ఇక్కడితో. వచ్చేయ కూడదూ, ప్రియతమా! ఇన్నాళ్ళూ పడిన అర్థంలేని ఆరాటాన్ని రియలైజైన అలసటని నా వళ్ళో వాలి తీర్చుకోవడానికి. పదిహేనే ళ్ళ క్రితం మీర్నాకందించిన అపురూపమైన కానుక, పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని సంతరిం చుకుంటూన్న మన ప్రార్థనని అబ్బురంగా చూస్కోవటానికి.

ఈ రోజు సాయంత్రం రవీంద్ర భారతిలో 'పీనాజ్ మసానీ గజల్స్' ప్రోగ్రా ం వుంది. మూడు టికెట్స్ రిజర్వ్ చేయిస్తున్నాను. వస్తారు కదూ! మీర్రాలేకపో తే, నేనేం కోపం తెచ్చుకోను. అలిగి సాధించను. అంతా మామూలుగానే వుంటు ంది. ఎటొచ్చీ నాలోనే ఏ స్పందనలూ మూడ్లేరు మీరిక ఎప్పటికీ. బెదిరింపు కాదు,

మొదటిదీ, చివర్దీ కూడా విన్నపం. మన్నిస్తారు కదూ!

ఇంకా పేయనా—

మీ

నేను

—చదవటం అయిపోయినట్లుగా స్థిరంగా నిల్చిపోయాయి అతని కళ్ళు. కొద్దిగా వంచిన మొహంలో భావాలేం సరిగ్గా కన్పడ్డంలేదు. కానీ, అతనెలా ఫీలవుతున్నాడో నేనూహించగల్ను. ఉత్తరంలోని సౌకుమార్యం, చదివిన మనిషిని తాదాత్మ్యతో, రసరమ్యతో తేలిని భావనలో తేలియాడిస్తుదన్పించింది నాకు. కాళిదాసు పద్యాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నప్పటికీ దివ్యానుభూతి, ఎప్పుడో చిన్నప్పుడు శ్రీశ్రీ పద్యం "నేను సైతం..." చదివినప్పుడు కల్గిన ఆవేశం, లాటిదేదో మళ్ళీ కల్గింది. బుర్రంతా బ్లాంక్‌గా అయిపోయి, ఆఫీసు, టెండర్లు, కాంపిటీషన్లు గుర్తుకురాని సమాధి స్థితిలోకి వెళ్ళినప్పటి ప్రశాంతత. ఏజ్ రిగ్రెషన్' జరిగి జీవితంలో కొన్నేళ్ళు వెనక్కు నడిచి వెళ్తే ఎప్పుడో మరుగున పడ్డ అందమైన **జ్ఞాపకాలు**, ఊహలేవో తెరముందుకొచ్చి, యాంత్రికతను కూకటివేళ్ళతో కదిల్చినట్టు ఓ సుందర దృశ్యం. ఆ భాషలోని సున్నితమైన విషాదానికి మనసు కదిలి కదిలి కరిగి కరిగి విరిగి పడ్డ మేఘంలా వర్షించిన అలజడి. అమ్మ ఒడి వెచ్చదనం, నాన్న కరకు ప్రేమ, రవీంద్రుడి 'గీతాంజలి'లోని భావుకత, నందివర్ధనప్పువ్వు మీది మంచు బిందువు స్నిగ్ధత్వం, చిన్నప్పుడు అమ్మ చేయి పట్టుకుని రాముని కోవెలకు వెడుతూ మెట్ల మీదున్న గన్నేరు పువ్వుని అపురూపంగా అందుకున్న తాలుకూ జ్ఞాపకం— తిరిగి భావనా ప్రపంచలోకి వెళ్లబోతూన్న నన్ను, వెనక్కు లాగింది అతని ప్రశ్న. "రాజ్! ఇది నీ చేతికి ఎలా వచ్చింది?" నా కంఠం సన్నగా వణికింది. కానీ చెప్పాను. "సర్! ఈ రోజు ప్రొద్దున్న మీర్నా గదిలోకి పంపిన ఫైల్స్‌తో పాటు



## మరణాలు

ప్రపంచమంతటిలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలవల్ల 2,50,000మంది మరణిస్తున్నారు. భారతదేశంలో 80మంది రోడ్డు ప్రమాదాలవల్ల మరణిస్తున్నారు. 15,00,000 మంది కంట్లో కాటరాక్టు పొరవల్ల గుడ్డివారైపోతున్నారు. ఇందులో ఒక మిలియనుకంటే తక్కువమందికే శస్త్ర చికిత్స జరుగుతుంది.

—పురం రవీంద్రరావ్ (సుల్తానాబాద్)

పోగొట్టుగా ఇది నన్ను చేరింది. నా అంచనా ప్రకారం, ఈ రోజు ప్రొద్దున మీరు ఆఫీసుకు బయల్దేరేముందు, మీ సూట్‌కేసు లోని ఫైల్స్ మధ్య ఇది పెట్టబడి వుండాలి. అందుకే, మీరది చూసుకోలేకపోయారు, ఊపిరి పీల్చుకోవడానికన్నట్లుగా క్షణం ఆగా న్నేను. "కానీ..." ఏదో అడగబోయిన అతన్ని ఆపేసి మళ్ళీ చెప్పాన్నేను. "మీ పేరు రాజశేఖర్ అయినా మీర్నాకు శేఖర్‌గా మాత్రమే తెల్సు. ఐ యామ్ రాజ్... ధన్‌రాజ్. అందుకే 'రాజ్' అని అడ్రస్ చేయబడ్డ ఎన్వలప్ చూసి నాకేమోనని ఓపెన్ చేసాను. చేసి, చదువుతూన్నప్పుడు అర్థమయింది, అది నాది కాదని. ఆలోచిస్తే తెల్సింది, మీదే అయివుండవచ్చునని. కానీ, సర్!... " చెప్తూన్నప్పుడు నా తల వాలిపోయింది. "ఐ జస్ట్ కాంట్ రిఫ్రెయిన్ మై సెల్ఫ్ ఫ్రం రీడింగ్ ఇట్" అమ్మయ్య, చెప్పేసాను. నాకు రిలీఫ్‌గా అన్పించింది. ఇక అతని రియాక్షన్ ఎలా అయినా ఉండనీ, ఐ యామ్ ప్రిపేర్డ్.

ఎడమ చేతి వేళ్ళతో జుట్టును వెనక్కు తోసుకుంటూ, కుడి అరచేతిలో మొహం దాచుకున్నాడతను అసహనంగా. ఏం చేయాలో తెలీనట్టుగా నించుండిపోయాన్నేనక్కడ. కాసేపటికి మామూలుగా అయిపోయాడతను. తలెత్తిన అతని కళ్ళలో అదో కొత్త 'గ్లో' చేతి గడియారం వంక చూసుకున్నాడతను. అయిదూ పది. నా భుజ మీద తన చేతినుంచి నొక్కి అన్నాడతను. "రాజ్! ఈ ఉత్తరం ఈ రోజు నన్ను చేరకపోయుంటే, థింగ్స్ వుడ్ హావ్ బీన్ డిఫరెంట్. జీవితంలోంచి చాలా గొప్పదేదో పోగొట్టుకునే వాణ్ణేమో బహుశా. నీవు నన్నూ పరిస్థితి మంచి సేవ్ చేసావు. నౌ, పర్‌గెటిట్. గిల్టీగా ఫీలవడం మానేయ్. నౌ, అబౌట్ ద ప్రెజంట్ టెండర్ ఇష్యూ..." ఏదో చెప్పబోతూన్న అతన్ని మధ్యలో ఆపేసి, అన్నాన్నేను. "సర్! ఆ పని విషయం నేన్చూసుకుంటాను. ఇప్పటికే ఫైవ్ ఫిఫ్టీస్ మీ 'రవీంద్రభారతి' ప్రోగ్రాం సంగతి మర్చిపోయారా?" అని. "లేదు. కానీ, నీవు మాత్రం ఆఫీసు అవర్స్ దాటిపోయాక, పని చేయడం దేనికీ, రేపు మనిద్దరం వెళ్ళిచూద్దాం. నౌ, యు మే గో అండ్ సీ యూ టుమారో" అంత హడావుడిలోనూ, నా పట్ల అతను చూపిన కర్టసీకి తబ్బిబ్బయ్యాను నేను. "థ్యాంక్యూ వెరీ మచ్ సర్! ఫర్ ఎవ్విరిథింగ్" అతన్ని బయటి వరకూ సాగనంపుతూ చెప్పాన్నేను. "మీకు తెలీదు రాజ్! సౌదామిని నా ప్రాణం. నా అణువణువునూ. తనింత డిజెక్టెడ్‌గా ఫీలవుతూందని నేను గ్రహించలేకపోయాను. ఫూల్‌ని" ఎప్పుడూ గ్రేవ్‌గా వుండే అతను ఓపెన్‌గా చెప్పేస్తుంటే స్నేహంగా అతని చేతినందుకున్నాన్నేను. "కానీ మీకింకా అవకాశముంది కదా సర్, ఆవిడలోంచి ఆ ఫీలింగ్ తీసేయటానికి. ఆల్ ద బెస్ట్ ఫర్ దట్ అండ్ ఎంజాయ్ టుడే" మనస్ఫూర్తిగా నే చెప్పిన మాటల్ని అందుకున్నాడతను.

కారు కదలివెళ్ళిపోయాక, లోపలికి నడిచి నా రాక్‌కి తాళం వేసి బయటికి నడిచాను. ఎందుకో కారు తీయాలన్పించలేదు గారేజీలోంచి. చాలా రోజుల తర్వాత

నడవాలన్పించింది అందరు మనుష్యుల మధ్యలోంచి అందర్నీ గమనిస్తూ.

జట్టు వెనక్కు తోసుకుని రోడ్ పక్కగా నడుస్తూన్నాను. "సౌదామిని.. ఆవిడ పేరా! భావాల్లాగే పేరులోనూ సౌకుమార్యం. మనిషెలా వుంటుంది" ఉలిక్కిపడ్డాను. నేను నా ఆలోచనా విధానానికి. నా జీవితంలో జరిగిన ఓ అపురూపమైన విషయంగా తప్ప దాన్ని మరోలా గుర్తుంచుకోదల్చుకోలేదు నేను. ఒక్కక్షణం ఎందుకో ఒంటరిగా ఫీలయ్యాన్నేను. అప్పుడు గుర్తొచ్చింది— 'ప్రియంవద' హఠాత్తుగా ఆమె సమక్షం కావాలన్పించింది. నా ఒంటరితనపు అశాంతిని ఆమె నీడలో మర్చిపోవాలన్పించింది. నా పిల్లలు సందీప్, సంజయ్— ఎప్పుడైనా తల్చుకున్నానా, అసలు వీళ్ళని. ప్రియంవద నా గురించి ఎలా ఊహిస్తుంది? సౌదామిని లాగేనా? ఎందుకో సంతోషంతో కూడిన బాధ నాకు. అర్జంటుగా ప్రియంవదను చూడాలి. కనీసం వినాలి. ఎదురుగా షాపులో కన్పించిన ఫోనుని చూడగానే ఏదో గుర్తొచ్చింది నాకు.

"హలో! ప్రియా... నేను". "హలో" అన్న ఆమె పిలుపుకి నా కంఠం సున్నితంగా ప్రకంపించింది. "మీరా! ఈ రోజు కూడా లేటా?" ఆమె గొంతులో సంతోషం, అంతలోనే నీర్సం. "కాదురా! వస్తున్నాను. ఇంకా, నీవు, నేను, పిల్లలు 'రెయిన్‌మాన్' సిన్మాకెళ్తున్నాం. బీ రెడీ". "ఈజిట్!" ఉలికిపాటుతో, ఉత్తుంగ తరంగాల్లా లేచిన సంభ్రమాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరయే కంఠంతో నా అలకలకొలికి... అలవేల్మంగ... ఇంకేం చెప్పనూ?

*

